REGD : No. H 18 విడిప్రతి 0-20పై. 28-1-66 శుక్రవారం

# జమీన్‌రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 4

## మద్రాసుగవర్నరుగా కబీర్?

శ్రీమతి ఇందిరాగాంధీ క్రొత్తమంత్రివర్గంలో చేరని శ్రీ హుమయూన్ కబీరు మద్రాసు గవర్నరుగా నియమితులు కావచ్చునని ఢిల్లీ వార్తలు చెప్తున్నవి. ఈ విషయంలో కేంద్రనాయకులు ముఖ్యమంత్రి శ్రీ భక్తవత్సలం, కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కామరాజ్ అభిప్రాయాలు తీసుకోవడంకూడా జరిగిందట. కేంద్ర మంత్రిత్వం పోయినా, రాష్ట్ర గవర్నరుగా పునరావాసం పొందబోతున్నా దన్నమాట శ్రీ కబీర్!

# కేంద్రమంత్రాంగం: రాష్ట్ర ప్రాతినిధ్యం

## శాఖల కేటాయింపులో శ్రీ సంజీవయ్యగారివర్గీయుల సంతోషం:

## శ్రీ సంజీవరెడ్డి అనుయాయుల అసంతృప్తి

## ఢిల్లీనుండి నిరుత్సాహంతో దిగిన ముఖ్యమంత్రి





(మా హైదరాబాదు విలేఖరి)

శ్రీమతి ఇందిరాగాంధీ నూతన మంత్రివర్గంలో ఆంధ్రదేశానికి పూర్వంకంటే తగ్గనిరీతంగా ప్రాతినిధ్యం లభించడం రాజధాని రాజకీయవర్గాల్లో, ముఖ్యంగా కాంగ్రెసువర్గాల్లో సంతృప్తిని కలిగించింది.



ఈసారి మంత్రులజాబితా ప్రకటనలో పూర్వపు మంత్రివర్గంలో నీలం సంజీవరెడ్డిగారిస్థానంలో (9వ స్థానంలో) దామోదరం సంజీవయ్యగారి పేరున్నది. పూర్వం సంజీవయ్యగారి స్థానం పద్నాల్గవది. ఇప్పుడు సంజీవరెడ్డిగారిది పదమూడవది. ఇందులో ఏదోవుంది; కొత్తప్రధానికి వీరిద్దరిలో ఎవరు హెచ్చుయిష్టులో యిందువల్ల తెలుస్తున్నదని సంజీవయ్యగారి అనుచరులు సంతోషిస్తున్నసమయంలో, ఇందులో ఏమీలేదు, అసలు యిప్పటి మంత్రివర్గంలో 'రేంకు'లంటూ లేనేలేవని ఢిల్లీనుంచి "క్లారిఫికేషన్" రానేవచ్చింది.

ఇతర పరిశ్రమల లాంటి ప్రధానమైన శాఖను సంజీవయ్యగారికివ్వడం, పైగా ఆయనకంటే సీనియరైన జగ్జీవనరామ్ గారికి సంజీవయ్యగారు ఖాళీచేసిన ఉద్యోగాలు, కార్మికశాఖ నివ్వడం; పరిశ్రమలకంటే ప్రాముఖ్యతలో తక్కువగా కనిపిస్తున్న ట్రాన్స్‌పోర్టు, కమ్యూనికేషన్స్, షిప్పింగ్, టూరిజంలాంటిశాఖలను సంజీవరెడ్డిగారికివ్వడంలో కూడా ఏదోవుందనే అభిప్రాయం యిక్కడ ప్రబలంగావుంది.

ఇందులో నిజానిజాలు ఆ పెరుమాళ్ళకే యెరుక. కాని సంజీవరెడ్డిగారి అనుయాయులకీవిషయం కొంత అసంతృప్తికరంగానే వుంది. అయినా సంజీవరెడ్డిగారే ఉక్కు, గనులశాఖాధిపత్యాన్ని చాలించదలుచుకున్నారనీ అందుకే ఈ మార్పు జరిగిందనీ, ఒక మంత్రిప్రాధాన్యత అతను నిర్వహిస్తున్న శాఖనుబట్టికాక, రాజకీయంగా అతనికి గల స్థానంపై ఆధారపడి వుంటుందనీ ఒక భావనవుంది; ఇందులో చాలా నిజం లేకపోలేదు.

ఢిల్లీలో పదిరోజులు మకాంచేసి, నూతన ప్రధాని యెన్నికలో కీలకమైన పాత్రను నిర్వహించి తిరిగివచ్చిన ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిలో యేదో అసంతృప్తి వున్నట్టు ద్యోతకమైంది. 1964 జూన్లో లాల్‌బహదూర్‌శాస్త్రి ప్రధాని కావాలని నిర్ణయమైన అనంతరం, హైదరాబాదు తిరిగివచ్చినప్పుడు బ్రహ్మానందరెడ్డిగారు ఆనాడెంత వుత్సాహంగా కనిపించారో, ఈ శుక్రవారంనాడాయన అంత నిరుత్సాహంగా కనిపించారు. ఇది అలసటైనా కావచ్చును. ఆనాడు ఢిల్లీనుంచి ఎనిమిది గంటలకు రావలసిన కారవెల్లీవిమానం 11-30 కు బేగంపేటచేరింది. పత్రికావిలేఖరులు యిలాంటి సందర్భాల్లో సాధారణంగా ముఖ్యమంత్రిని కలుసుకొని ఢిల్లీ వివరాలను ఆయన ముఖతా వినడం అలవాటు. ఇందులో ప్రచురించవలసింది హెచ్చుగావుండదు. కాని పత్రికల్లోరాని వివరాలుకొన్ని బయటపడుతూవుంటాయి. ఈసారిమాత్రం ముఖ్యమంత్రి అసాధారణంగానే మౌనీభావంవహించారు. సమాధానాలు చాలా టూకీగా అటూయిటూ కాకుండా చెప్పారు. "మీరిలా ఎందుకున్నారు" అని చివరికొక విలేఖరంటే, "చెప్పడానికేముంది బ్రదర్?" అన్నారు. అదీ నిజంకావచ్చు. చివరికి అరగంటైనా ఏమీ ప్రయోజనం కనిపించక అందరం లేచి వెళ్ళిపోయాం.

☘

# నెల్లూరు ఆరోపణలు : విచారణకు ఏ. సి. సంసిద్ధత?

బ్రహ్మానందరెడ్డిగారు ఢిల్లీకి వెళ్ళకముందే నెల్లూరు నాయకులు కొందరు ఆయన్ను కలుసుకొని, "ఏ. సి."పైన తమ అభియోగాలపత్రాన్ని సమర్పించారట. అప్పుడు ముఖ్యమంత్రికి కొంత చికాకు కలిగిందనీ, దాన్ని ఆయన కనపరచారనికూడా తెలుస్తున్నది. నెల్లూరువారు ఈ విషయాన్ని చాలా దూరం తీసికెళ్ళుతున్నారని, దీనిఫలితాలు అవాంఛనీయంగా వుండవచ్చుననే భావం ముఖ్యమంత్రికి వున్నట్టు తెలుస్తున్నది. పైగా ఈ అభియోగం విషయం పత్రికలకు ఎక్కించవద్దనికూడా ముఖ్యమంత్రి ఈ నెల్లూరు నాయకులకు నచ్చచెప్పినట్లు తెలుస్తున్నది. కాని ఈ విషయమంతా గత వారమే బయటపడింది.

ఈ అభియోగాల్లో నిజం, సారంఏమీ లేదనీ, ముఖ్యమంత్రి న్యాయమూర్తిద్వారా విచారణ చేయించదలిస్తే తను సిద్ధమేనని "ఏ. సి." తన సన్నిహితులతో అన్నట్టు తెలుస్తున్నది. రెండు సంవత్సరాల్క్రితమే ఎవరో రెండవపంటకు నీరు ఇప్పిస్తామని ఎకరాకి ఇంతచొప్పున తనపేర రైతుల వద్దనుంచి వసూలు చేస్తున్నట్టు తనకు తెలిసిన వెంటనే ఒక బహిరంగసభలో తానే ఆ విషయం ప్రస్తావించి, అలా డబ్బు ఎవరికీ ఇవ్వవద్దని రైతులకు చెప్పాననీ ఆయన అంటున్నారట. పైగా ఈ విషయమై అదివరకే అవినీతి నిరోధక శాఖవారు విచారణజరుగగా, ఈ అభియోగాలుచేసినవారే ఇందులో నిజంలేదని అధికార్లకు చెప్పారనికూడా తెలుస్తున్నది.

ఏమైనా ఈ ఆరోపణలు అభియోగాలు రచ్చకెక్కడం ముఖ్యమంత్రి గారికేమాత్రం ఇష్టంగాలేదని నమ్మకంగా తెలుస్తున్నది.

☘

ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదులోను విశాఖపట్టణంలోను చట్టబద్ధమైన రేషనింగు విధానాన్ని

—కొరవ 7-వ పేజీలో

**WANTED INVESTORS**

Wanted four partners who can invest Rs. 50,000 cash, for producing an experimental and a highly successful motion picture The story and screen play are at ready for filming There is a gaurantee for the grand suceess of the picture as the story was writen by an outstanding person, after perfectly studying the present tastes of various cine goers. Those who desire to join as partners, may immedi. ately write to the:

Advr. Box No. 150,
THE ZAMIN RYOT, NELLORE.

24-1-66 నుండి

నిర్మల వక్కపొడి

వాడకందార్లకు విజ్ఞప్తి

మా వక్కపొడి 0-02 న. పై. పొట్లములకు బదులుగా 0-03 న. పై. పొట్లములు ప్రవేశపెట్టినాము.

గమనిక:- ప్రతి 50 పొట్లముల ప్యాకెట్టు వెనుకభాగమున (నిర్మల) 0-03 పైసలు అని వ్రాసియుండును.

మా ఖాతాదార్లు గమనించ ప్రార్థన.

నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు – నెల్లూరు.

